# చిరంజీవి కథ

రామచంద్రరావు బీదవాడు అనటానికేమీ సందేహం లేదు. కాని చినిగిన చొక్కానైనా ఉతికి ఇస్త్రీకి రుద్దించి గాని వెయ్యకపోవటం చేతనూ, తిన్నా తినకపోయినా తిన్నట్టే నటించటంలో నేర్పు చూపించటంలోనూ అతనికి డబ్బున్న వాడల్లె బతకాలని ఉన్న వాంఛ నిస్సందేహంగా ఋజువైంది. రామచంద్రరావు ముప్పైరూపాయల సంపాదన పరుడైనా పెళ్ళాం ఏదో ఒకటి 'లేదు' అనని రోజు క్యాలెండర్లో లేకపోయినా ఆ లేమిని బైటికి కనపర్చకపోవడం చేత ఉన్నవాళ్ళల్లో జతకావాలని చూశాడు; లేనివాళ్లల్లో కలవనూ లేకపోయినాడు.

ఇటువంటి ప్రవృత్తివలన అతడి జీవితం స్వర్గాన్నూహిస్తూన్న నరకంలో బతుకుతున్న వాడల్లే ఉంటూ వచ్చింది. డబ్బుతో సాధించే సౌఖ్యాలు, డబ్బుతోటే సాధ్యమౌతాయి గాని, మరొక రకంగా అందవని రామచంద్రరావుకి స్పష్టంగా తెలుసు. కాని వాటిని ఊహిస్తూ పొందినట్టే నటించడంలో ఆతడి ఆత్మ పడే బాధ, అతని ప్రతి వెకిలి నవ్వులోనూ, అస్పష్టంగా వ్యక్తమౌతూ వచ్చింది.

రామచంద్రరావు భార్యా ఇందుకు సరిపోయిన ఘటమే. కాని, ఆ పద్ధతి వేరు ఆమెకి దాదాపుగా డబ్బు ఎలా వస్తోందో ఆలోచించే సంస్కారం లేదు. ఎప్పుడూ గొప్ప చీరెలు కట్టాలనీ, డబ్బున్న తన చుట్టాలతోటి తుల తూగాలనీ, భర్తతో నిత్యం పోరాడేది. రామచంద్రరావు ఈ పోరును అణిచి ఉంచాడు అనేక రకాల. అయితే తన భార్య కోర్కెలు తీరాలని అతనికీ వుంది. ప్రయోజనమే లేదుగాని!

★ ★ ★

రామచంద్రరావులో అకస్మాత్తుగా ఒకపరివర్తన వచ్చింది. ఎలాగైనా డబ్బు సంపాయించి తన ఊహల్ని నిజం చేసుకోవాలని అతడు పట్టుపట్టాడు. అందుకోసం తనేం జెయ్యాలో అతడికి తెలీలేదు. అందుకోసం అతడు ఇంకెవరినన్నా అడిగివుంటే ఎలా వుండేదో; అందుకు అతని పౌరుషం అడ్డం వచ్చింది. భార్యని అడగడమైనా పౌరుషహీనమే. అతని కాలోచన లేదు. వెనకటి ఆలోచనలకితోడు ఇదొకయావతోడైంది. మనిషికి సామాన్యంగా ఏ నలభై ఏళ్లకో గాని తల నెరవదు. రామచంద్రరావుకి ఆలోచనలతో తల సగం నెరిసింది పాతికేళ్ళకే. అసలుమనిషి కొంచెం చామన చాయగా వున్నప్పటికీ ఇదివరకు (చిన్నప్పుడు) నిగనిగ లాడతూ వుండేవాడు. ఇప్పడు మాడి మసిబొగ్గు అయినాడు.

రామచంద్రరావుకి కొంచెం భాషాజ్ఞానం వున్నది. అతను బడిపంతులు అయినప్పటికీ ఇంకా అతనిలో యాంత్రిక దృక్పథం రాలేదు. కొద్దిగా కల్పనాశక్తికూడా అతనితో మిగిలివుంది. కారణం అతనెప్పుడూ వాస్తవిక జీవితంనించి వేరుపడి ఊహాప్రపంచంలో బయట పడడమే నేమో!

రామచంద్రరావు ఓ చిన్న కథరాసి పత్రికకు పంపించాడు. అ కథకి బహుమతిగా ఓ పత్రిక పంపించారు. రామచంద్రరావుకి డబ్బు మీద మోజు రోజు రోజుకూ ఎక్కువ కాసాగింది. అతను విరివిగా కథలు రాయటం సాగించాడు. ఓ పత్రిక అతనికి రెండు - మూడు - ఐదు ఇలా డబ్బు పంపసాగింది.

రామచంద్రరావుకి డబ్బు మీద మోజు, పత్రికలకి కథలు రాయటం వల్ల తీరకపోయినా, డబ్బు సంపాయించటానికి ఇదీ ఒక మార్గమేమో నని అతను భ్రమపడిన మాట మాత్రం వాస్తవం. అయితే డబ్బు ఎంతో కొంత వస్తున్నది కనుక కథలు రాయటాన్ని అతను ఓ ఉపవృత్తి క్రింద జమచేసి కథలు వ్రాయసాగాడు.

★ ★ ★

ఒక్కొక్క మనిషియొక్క కొన్ని కొన్ని ప్రత్యేక ప్రవృత్తులు ఆ వ్యక్తే గనక కథారచయిత అయితే ఆ రచనల్లో ప్రతిఫలించి తీర్తాయి. రామచంద్రరావు రాసిన కథలు పాఠకులను ఏవో అనూహ్యమైన లోకాలకు తీసుకెళ్ళేవి. రామచంద్రరావు స్వతహాగా ఏనాడూ అనుభవించని సుఖాల్ని, తన పాత్రచేత అనుభవింపచేసి, పాఠకుల్ని భ్రమింపజేసి, వాళ్ల ఆదరణని చూరగొన్నాడు. రామచంద్రరావు పక్కింటి అమ్మాయి వంక చూడనైనా సాహసించలేక పోయినప్పటికి; అతని కథానాయకులు పొరుగింటి అమ్మాయిల్ని, రైళ్ళల్లో, సినిమాల్లో తటస్థ పడ్డవాళ్ళనీ, చాలా ధైర్యంతో, లేవదీసుకుపోయేవాళ్ళు.

రామచంద్రరావు వ్రాసే కథలు ఎల్లప్పుడూ జీవితం నుంచి దూరంగా వుంటూ, పాఠకులకు తియ్యటి కలలొచ్చే టట్టు చేస్తైనె. అతని కథలకి మార్కెట్టు వాల్యూ ఏర్పడ్డది. ఇటువంటి కథలు రాయటంలో అతనికున్న నైపుణ్యాన్ని ప్రతి పత్రికా మెచ్చుకుంది. అతని 'ఫాంటాస్టిక్' కథలకీ, 'రొమాంటిక్' కథలకీ ఎక్కడలేని ఆదరణా ఏర్పడ్డైనె.

ఇటువంటి కథలు రాయటానికి అతనికున్న శక్తి ఏమిటా అని ఇతర రాయలేని రచయితలు ఆ దుర్దాపడ్డారు. అతన్నే అడిగారు కూడాను. రామచంద్రరావు మామూలుగా వెకిలినవ్వు నవ్వటంకన్న ఇంకేమీ చెప్పలేక పోయినాడు.

అట్లాంటి కథలు రాయటానికి అతని ఊహలన్నీ స్వర్గంలో ఉండటమే కారణం. ఇంకో కారణం - అతని జీవితం నరకప్రాయంగా నిత్య దారిద్ర్యంలో వుండటం - అందుచేతనే ఆచరణలోనూ, స్వానుభవంలోనూ సాధ్యం కానివాటిని తియ్యగా, అద్భుతంగా ఊహిస్తూ అతనుతననీ, తన జీవితాన్నీ, మరచిపోయి 'ఫాంటాస్టిక్' 'రొమాంటిక్' కథలు రాయగలడేమో! ఈసంగతి రామచంద్రరావుకి తెలీదు.

★ ★ ★

అతని ఆదాయంలో చెప్పుకోతగినంత మార్పేమీ రాలేదు. బీడీలు పోయి సిగరెట్లు వచ్చినై; ఎవరికీ తెలియని రామచంద్రరావు అందరికీ తెలిసి అభినందనాలందుకోవడం వొచ్చింది. కీర్తి లభించింది.

కీర్తి పెరిగినకొద్దీ ఇంకా ఏ దేశంలోనైనా అయితే రామచంద్రరావు ఆర్థికంగానైనా బాగుపడి, వేళకి తప్పకుండా అన్నమన్నాతిని ఉండును. తిండిలేని జర్నలిజానికి పేరొందిన ఆంధ్రదేశంలో పుట్టి రామచంద్రరావు కీర్తి మాత్రమే ఆర్జించాడు. ఇందుకోసం వెట్టిచాకిరీ చెయ్యటమే కాని ఆదాయం కోసం నడుస్తున్నవి కాదు. కథకులకు ఈ పాటైనా డబ్బిస్తున్నారంటే అందులో ఏదో రహస్యం ఉండి వుండాలి.

రామచంద్రరావు డబ్బుకావాలని ఎప్పుడూ పత్రికలకు ఉత్తరాలు రాస్తూ వుండేవాడు. రెండు నెలలకీ, మూడు నెలలకీ వాళ్ళూ పంపించేవాళ్ళు; ఆగిపోయిన పత్రికలు తప్ప.

★ ★ ★

రామచంద్రరావు వ్రాసిన ఓ కథ చాలా బావుందని సంపాదకుడు వ్రాశాడు. దానికిపది హేను రూపాయలు పంపిస్తామని కూడా తెలియజేశాడు. రామచంద్రరావుకి అదేరోజున టైఫాయిడ్ ఉధృతంగా వొచ్చింది. అతను జ్వరంలోనూ తన కథలనుగురించే కలవరించాడు. కథల్లో 'కళ' గురించి ఉపన్యాస ధోరణిలో వాగుతున్నాడు. అతడి భార్యకేగనక ఆస్తి యావ ఉండుంటే - దస్తావేజు రాయించేందుకు ఆదుర్దా పడివుండేది. అంత ప్రమాదంలో పడింది జ్వరం.

రామచంద్రరావుని చూడ్డానికి కొందరు రచయితలు వొచ్చారు. అతనికివైద్యంచేసే డాక్టరుకూడా అతని పాఠకుడే, ఉచితంగానే చేస్తున్నాడు వైద్యం.

రామచంద్రరావు కథ - గొప్పగా ప్రచురింపబడింది. ఆ పత్రిక కాపీ అతనికి అందినరోజున రామచంద్రరావుకి వొంటిమీద స్మారకంకూడాలేదు.

స్నేహితులు తలాకాస్త డబ్బిచ్చి వెళ్ళారు ఖర్చులకి. అతని కథల్లో పాత్రలు వాస్తవమైనవి కావని, ఆ స్నేహితులు అతనికి వినపడేట్టు అని వెళ్ళారు. ఆ మాటలు రామచంద్రరావుకి వినపడ్డాయోలేదో చెప్పలేం. అతనికి టైఫాయిడ్ బహుశా నయంకాక పోవచ్చు. అతనికి డబ్బు అవసరమని అందరూ గుర్తించినా ''ఎప్పుడూ డబ్బు డబ్బంటాడు'' అని అన్నారు వాళ్ళు. చుట్ట పక్కాలవాళ్ళే కాదు; పత్రికల వాళ్ళు కూడాను. రామచంద్రరావుకు పంపిన కథ తాలూకు డబ్బు అతని ఉత్తరక్రియలకు అందితీరుతుందని అతని భార్య ఎదురు చూస్తున్నది. రామచంద్రరావు జీవితంలో ఇంకేడబ్బున్న వాడు అనుభవించని ఆనందాల్ని ఊహించాడు. అతనికి మరణం గూడా 'మరణిస్తున్నాం' అని స్పృహ తెలిసిన స్థితిలో రాక పోవటం కూడా ఒక అదృష్టమనే అతడు భావిస్తాడు. తెలిస్తే.

*('రక్తస్మరణ' కథల సంపుటి, 1963)*